సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 9 । మే । 2024



కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మేలు - IIలో▸

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.



బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి - IIలో▸

నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని బీజేపీ అధిష్టానం ప్రకటించింది.

గరిష్టం/కనిష్టం $38^0/27^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 9 నుంచి మే 20వతేదీ వరకు జరిగే ఈఉత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, చల్లని తాగునీరు, లైటింగ్ సిస్టమ్, మధ్యాహ్నం ఉచిత అన్నప్రసాదాల వితరణ, క్యూలైన్లు తదితర ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి మూలమూర్తి కవచానికి బంగారుపూత వేయించారు. కాగా.. గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వాహన సేవ నిర్వహించనున్నారు. 12వ తేదీన భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం జరగనుంది. ఉత్సవాల సందర్భంగా జరిగే సేవల్లో వివిధ కుల సంఘాలు ఉభయ దాతలుగా వ్యవహరించనున్నాయి. కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.516 చెల్లించి రశీదు పొందవచ్చని, వారికి ప్రసాదం, అక్షింతలు, శేష వస్త్రాలు అందజేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మూల్యాంకనం షురూ

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. హనుమకొండలోని తోటబడిలో క్యాంపును నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు సుమారు 18 వేల వరకు రాగా.. ఏఈలుగా, సీఈలుగా అధ్యాపకులను నియమించి వాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. క్యాంప్ ఆఫీసర్‌గా హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై వ్యవహరిస్తున్నారు. ఏసీజీఈ చలపతిరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈప్రక్రియ ఈనెల 10 వరకు కొనసాగనుంది. ఇదిలా ఉండగా.. ఓపెన్ స్కూల్ టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ఈనెల 5న ప్రారంభమై 7వ తేదీన ముగిసింది.

వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు



హన్మకొండ: హనుమకొండ జిల్లాలో వానాకాలం సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ ఖరారు చేసింది. పంటల విస్తీర్ణం, ఎరువులు ఏ మేరకు అవసరమో అధికారులు అంచనా వేశారు. గత సంవత్సరం వానాకాలంతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. జిల్లాలో అన్ని పంటలు కలిపి 2,40,220 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. గత వానాకాలంలో 2,33,281 ఎకరాల్లో సాగు చేశారు. వరి గత సంవత్సరం 1,45,943 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానాకాలంలో 1,48,400 ఎకరాలు, పత్తి గతేడాది 82,277 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానాకాలంలో 85 వేల ఎకరాల్లో సాగుకానుందని అంచనా వేశారు. మొక్కజొన్న గతేడాది 4,187 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానా కాలంలో 5,820 ఎకరాల్లో, నూనె గింజలు గతేడాది 265 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానాకాలంలో 300 ఎకరాల్లో, పప్పు దినుసులు గతేడాది 180 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ వానా కాలంలో 608 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు.

17 వరకు బీపీఈడీ రెండో సెమిస్టర్ ఫీజు గడువు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి బీపీఈడీ సెకెండియర్ రెండో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) విద్యార్థులు ఈనెల 17వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు గడువు ఉందని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ : గ్వాలియర్‌లోని లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీజీ డిప్లొమా స్పోర్ట్స్ కోచింగ్, పీజీ డిప్లొమా ఇన్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌ఓ సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వివరాల కోసం www.lnipe.edu.in లో సంప్రదించాలని కోరారు.

నమోస్మరణ!

ఓరుగల్లు జనసభలో మార్మోగిన మోదీ నినాదం

- ఎటుచూసినా ప్రధాని బొమ్మలు, ప్లకార్డులు
- వరంగల్ అంటే అభిమానమన్న ప్రధాని మోదీ
- కష్టకాలంలో వెన్నంటి నిలిచిందని పాత గుర్తులు
- బీజేపీ అభ్యర్థులను గెలిపించాలంటూ అభ్యర్థన

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



బీజేపీ ఓరుగల్లు జనసభకు హాజరైన వారికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

సాక్షి, వరంగల్ : వరంగల్ నగరం కాషాయ జెండాలతో రెపరెపలాడింది. వరంగల్, మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థులు అరూరి రమేశ్, సీతారాం నాయక్‌ను గెలిపించాలంటూ గ్రేటర్ వరంగల్ పరిధిలోని మామునూరు తిమ్మాపూర్ క్రాస్‌రోడ్డు లక్ష్మీపురం మైదానంలో బుధవారం నిర్వహించిన ఓరుగల్లు జనసభలో ప్రధాని నమో నినాదం మార్మోగింది. సభలో ఎక్కడ చూసినా నమో బొమ్మలతో కూడిన ప్లకార్డులు కనిపించాయి. భారీ ఆకృతిలో ఉన్న ఫ్లెక్సీలు సభా ప్రాంగణంలో ప్రజలు పట్టుకొని ఉండడం చూసి మోదీ ఫిదా అయ్యారు.

ఓరుగల్లు అంటే అభిమానమంటూ..

'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు.. నా అదృష్టం ఏమిటంటే నేను పనిచేసినటువంటి అహ్మదాబాద్ అధిష్టాత్రి దేవత కూడా భద్రకాళి. ఆ భద్రకాళి అమ్మవారికి, ఆమె చరణాలకు నేను ప్రణామం చేస్తున్నా. ఇక్కడినుంచి కొంచెం దూరంలో ఉన్న రామప్ప మందిరానికి కూడా నేను నమస్కారాలు చేస్తున్నా. ఈ ప్రాంతం కాకతీయుల విజయ గౌరవ పతాకకు ప్రతీక. మూడో దశ పోలింగ్‌ను కూడా పూర్తి చేసుకొని ఇక్కడకు వచ్చి మీ ఆశీర్వాదం తీసుకునేటువంటి అదృష్టాన్ని పొందా' అంటూ మోదీ ప్రసంగం ప్రారంభించడంతో సభికులు పెద్దపెట్టున మోదీ.. మోదీ అంటూ నినాదాలు చేశారు. 'నా దృష్టిలో వరంగల్ చాలా ముఖ్యమైనటువంటి చోటు. 40 సంవత్సరాల క్రితం బీజేపీకి ఇద్దరంటే ఇద్దరు ఎంపీలు ఉన్నప్పు డు అందులో ఒకరు మన హనుమకొండ నుంచి దివంగత నేత జంగారెడ్డి. బీజేపీ మీ అభిమానాన్ని, ఆశీర్వాదాన్ని, స్నేహాన్ని ఎప్పటికీ మరిచిపోలేదు. మాకు ఎప్పుడు కష్టం వచ్చినా వరంగల్ ప్రజానీకం వెన్నంటి నిలిచారు. అందుకే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఇనుప గుప్పిటనుంచి వరంగల్‌ను బయటకు తీసేందుకు బీజేపీ సర్వప్రయత్నాలను చేయబోతోంది' అని వ్యాఖ్యలు చేశారు. 'కేంద్రం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ ప్రభుత్వానికి ఇబ్బందిగా ఉంది. వరంగల్‌లో మేం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేశాం. కానీ, పార్కు నిర్వహణ విషయంలో సమస్యలు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణకు నష్టం చేస్తున్నటువంటి, ఇబ్బందులు కలిగిస్తున్నటువంటి వాళ్లకు జవాబు చెప్పాల్సిన సమయం వచ్చింది. మీ అందరిని కోరుతున్నాను. వరంగల్ నుంచి అరూరి రమేశ్, మహబూబాబాద్ నుంచి సీతారాంనాయక్‌ను లోక్‌సభకు పంపించండి. మోదీకి బలం చేకూర్చండి అంటూ సభికులను ఆయన అభ్యర్థించారు. ఇంకోవైపు కళాకారులు నిర్వహించిన కళానృత్యాలు అందరినీ అలరించాయి. మోదీ పాటలకు సభకు హాజరైన కొందరు స్టెప్పులేయడం కనిపించింది.





ఓరుగల్లు జన సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ, పక్కన బీజేపీ వరంగల్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులు అరూరి రమేశ్, సీతారాంనాయక్

వేదికపై అగ్రనేతలు.. అభ్యర్థులు

వేదికపై మోదీకి ఒకవైపు మహబూబాబాద్, వరంగల్ ఎంపీ అభ్యర్థులు సీతారాంనాయక్, అరూరి రమేశ్ ప్రజలకు నమస్కరిస్తూ కనిపించారు. మురళీధర్‌గౌడ్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అధ్యక్షతన సభ జరగగా. మోదీ ప్రసంగాన్ని హైదరాబాద్‌కు చెందిన రాక సుధాకర్ అనువదించారు. ప్రధాన వేదికపై నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, చందుపట్ల కీర్తిరెడ్డి, పార్టీ వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ, నిశిధర్‌రెడ్డి, దశమంతరెడ్డితో పాటు నాయకులు కుమారస్వామి, మార్తినేని ధర్మారావు, గరికపాటి మోహన్‌రావు, కొండేటి శ్రీధర్, డాక్టర్ రాజేశ్వర్‌రావు, స్వాతిరెడ్డి, రావుల కోమల, జలగం అనిత, డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ విజయరామారావు, అల్లం నాగరాజు, జలగం రంజిత్‌రావు, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మల్లాడి తిరుపతిరెడ్డి కూర్చున్నారు.

ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధికి ఆస్కారం ఎక్కువ



'కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే. వరంగల్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా గెలిపిస్తే అభివృద్ధికి ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థతో పాటు మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు మోదీ సహకారం తీసుకుంటా. మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్వహణకు నిధులు వచ్చేలా చేస్తా. కాజీపేట రైల్వే డివిజన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తా. వాణిజ్య పంటలు అయిన పత్తి, మిర్చి, పసుపు, ఉద్యాన పంటల అభివృద్ధికి వస్త పరిశోధన కేంద్రం ఏర్పాటు, భూపాలపల్లి – పరకాలకు రైల్వే లైన్ అనుసంధానం, సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా కోసం కృషి చేస్తా. ఈ ఓరుగల్లు జన జాతర చూసి కాంగ్రెస్ నాయకుల వెన్నులో వణుకు పుట్టింది. రాష్ట్రంలో ఆ పార్టీ దొంగ హామీలను ప్రజలు పసిగట్టారు. ఓటుతో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

– వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్



బీజేపీకి ఓటు వేసి నన్ను గెలిపిస్తే మోదీ సహకారంతో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చేసి కొత్తరూపు తీసుకువస్తా. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉంటుంది. గతంలో నేను ఎంపీగా పనిచేశా. ప్రజా సమస్యలు నాకు తెలుసు. కేంద్రంలో మళ్లీ బీజేపీ సర్కారు వస్తోంది. మరోసారి గెలిపిస్తే ఇంకా అభివృద్ధి చేస్తా.

– మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

మోదీ పర్యటన సాగింది ఇలా..

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మామునూరు విమానాశ్రయానికి ఉదయం 11.30 గంటలకు చేరుకోవాల్సి ఉండగా.. 12.20 గంటలకు చేరుకున్నారు.

- 12.22 గంటలకు ప్రత్యేక వాహనంలో లక్ష్మీపురం సభాస్థలికి బయలుదేరారు.
- 12.29 గంటలకు ఓరుగల్లు జన సభావేదిక పైకి వచ్చారు.
- 12.32 గంటలకు ప్రసంగం ప్రారంభించి.. 1.17 గంటలకు ముగించారు.
- 1.20 గంటలకు సభావేదిక నుంచి నిష్క్రమించారు. ప్రత్యేక వాహనంలో నేరుగా బెటాలియన్ అంతర్గత రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టుకు చేరారు.
- 1.35 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లారు.

బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజం
- ట్రాఫిక్ ఆంక్షలు లేకుండానే సాగిన ప్రధాని పర్యటన
- రహదారిపై యథావిధిగా వాహనాలకు అనుమతి
- పటిష్టమైన పోలీసు భద్రత

II లో▸ **ప్రజల ముందుకు పాత వాగ్దానాలే**
- తెలంగాణలో తిరిగే హక్కు మోదీకి లేదు
- శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

కాశోజీ సెంటర్ : ఈసీ నిబంధనల మేరకు ఈనెల 13వ తేదీన ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ పార్లమెంట్ పరిధి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల సహాయ రిటర్నింగ్ అధికారులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించి, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని, ఎక్కడైనా పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. పోలింగ్‌కు 72 గంటల ముందు పాటించాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్‌ఓల ద్వారా ఓటర్ల సమాచార స్లిప్పుల పంపిణీ పూర్తి కావాలని సూచించారు. ఈనెల 12న డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల్లో చేసే ఏర్పాట్లను సమీక్షించారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్, పార్కింగ్ ప్లాన్ ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలతో కూడిన హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్‌కు ఒక రోజు ముందే పోలింగ్ కేంద్రాల్లో వసతులను చూసుకోవాలని ఆదేశించారు.

ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఓటింగ్ శాతం వివరాలు..

ప్రతి 20 పోలింగ్ కేంద్రాలకు ఒక అధికారి, ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌కు జిల్లాస్థాయి అధికారిని నియమించాలని సూచించారు. పోలింగ్ రోజున ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఓటింగ్ శాతం నమోదు నివేదిక పంపించాలని చెప్పారు. అధికారులు, సిబ్బంది ఒకరోజు ముందు పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా చూడడంతోపాటు వారికి వేసవి దష్ట్యా తగిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, సంధ్యారాణి, సహాయ రిటర్నింగ్ అధికారులు రోహిత్ సింగ్, వెంకన్న, నారాయణ, వెంకటేశ్, సిదం దత్తు, మంగీలాల్, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

6 గ్యారంటీలు, 60 మోసాలు

- అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

దేశాయిపేట/కాశిబుగ్గ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 60 మోసాలతో అధికారంలోకి వచ్చిందని పార్లమెంట్ ఎన్నికల వరంగల్ తూర్పు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా బుధవారం సాయంత్రం దేశాయిపేట సీకేఎం కాలేజీ, రాత్రి కాశిబుగ్గ జంక్షన్లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో అన్ని పదవులు అనుభవించిన కడియం శ్రీహరి పార్టీ మారడం సరికాదని, 30 ఏళ్ల వయస్సులోనే పార్టీలు మారిన కావ్య రానున్న రోజుల్లో అధికారం ఉన్న పార్టీల్లోకి మారడం ఖాయమన్నారు. పార్టీలు మారుతున్న కడియం కావ్యకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. కాంగ్రెస్, బీజేపీ ఇచ్చిన డబ్బులు తీసుకుని తెలంగాణ ఉద్యమకారుడైన మారేపల్లి సుధీర్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, నాయకులు డాక్టర్ హరిరమాదేవి, అచ్చ విద్యాసాగర్, మసూద్, బయ్యస్వామి, గోరంటల మనోహర్, విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. పండ్ల తోటలకు నష్టం

హన్మకొండ: అకాల వర్షానికి హనుమకొండ జిల్లాలో పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులకు మామిడి, అరటి తోటల్లో కాయలు నేలరాలి, చెట్లు నేల కొరిగి రైతులు నష్టపోయారు. 16 గ్రామాల్లో 109 మంది రైతులకు చెందిన 62.40 ఎకరాల్లో తోటలు గాలి వాన బీభత్సానికి గురయ్యాయి. ఇందులో 47.20 ఎకరాల్లో మామిడి, 15.20 ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చే దశలో పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోత దశలో మామిడి కాయలు నేలరాలడంతో అవి పనికిరాకుండా పోయాయి. అరటి చెట్లు విరిగి పడడంతో నష్టం చేకూరింది. మామిడి తోటలకు 15 నుంచి 20 శాతం, అరటి తోటలకు 10 నుంచి 15 శాతం వరకు నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

కేయూకు 11నుంచి సెలవులు

తెరిచి ఉండనున్న హాస్టళ్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి అలుమనాక్ ప్రకారం పీజీ కోర్సుల విద్యార్థులకు, అధ్యాపకులకు ఈ నెల 11వతేదీ నుంచి వేసవి సెలవులు ఉంటాయి. కాగా, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు హాస్టళ్లు తెరిచే ఉండనున్నాయి. మెస్‌లను కూడా కొనసాగిస్తారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో 12, 13న మెస్‌లను మాత్రం మూసివేస్తారని, ఆ తర్వాత తెరిచే ఉంటాయని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు.

రిజిస్ట్రేషన్లు మరింత సులభం

- జిల్లాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- మండలాల మార్పు చేపట్టేందుకు కసరత్తు



వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న మండలాలను భూక్రయవిక్రయదారుల సౌకర్యార్థం మండలాల మార్పును చేపట్టేందుకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కసరత్తు చేస్తోంది. కాగా.. ఇప్పటికే ప్రభుత్వానికి మండలాల మార్పునకు గాను నివేదికను ఉన్నతాధికారులు అందజేశారు. జిల్లాలకు అనుగుణంగా మండలాల మార్పుతో భూదస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అనువుగా ఉండే అవకాశం ఉండేందుకుగాను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం.

వరంగల్ ఆర్‌ఓ నుంచి..

వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కాజీపేట మండలాల భూ దస్తావేజులకు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. కాగా.. జిల్లాలకు అనుగుణంగా వరంగల్ మండలాన్ని వరంగల్ జిల్లాకు కేటాయించారు. వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గీసుకొండ, సంగెం మండలాలు ఉండగా.. వరంగల్ మండలాన్ని బదిలీ చేయనున్నారు. ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఖిలా వరంగల్, ఐనవోలు మండలాల రిజిస్ట్రేషన్లు కొనసాగుతుండగా.. జిల్లాల మార్పుతో ఐనవోలును హనుమకొండ జిల్లాకు కేటాయించారు. దీంతో వరంగల్ ఆర్‌ఓ కార్యాలయం నుంచి వరంగల్ మండలాన్ని వరంగల్ రూరల్‌కు, ఖిలా వరంగల్ నుంచి ఐనవోలు మండలాన్ని వరంగల్ ఆర్‌ఓకు మార్పు చేసే అవకాశం ఉంది. కాగా.. భౌగోళికంగా ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఐనవోలు మండలం వరంగల్ ఆర్వోకు దూరంగా ఉంటుంది. ఖిలా వరంగల్‌కు దగ్గరగా ఉంటుంది. దీన్ని పరిశీలనలోకి తీసుకుని మార్పు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఐనవోలు మండల భూక్రయవిక్రయదారులు విన్నవించుకుంటున్నారు.

తగ్గనున్న భారం

వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నాలుగు మండలాలకుగాను రోజువారీగా 120 నుంచి 150 దస్తావేజుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుంటాయి. కాగా.. వరంగల్ మండలాన్ని జిల్లాలోని వరంగల్‌రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయించడంతో సబ్ రిజిస్ట్రార్లతో పాటు భూక్రయవిక్రయదారులకు భారం తగ్గనుంది.

మండలాల మార్పునకు ఎన్నికల ఎఫెక్ట్

ఆయా జిల్లాలకు అనుగుణంగా ఆయా జిల్లాలను మార్చేందుకు రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి నివేదికను అందజేయగా.. మార్పు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. కాగా.. మండలాల మార్పునకు పార్లమెంట్ ఎఫెక్ట్ తగిలింది. ఎలక్షన్స్ తర్వాత మండలాల మార్పు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మీకు తెలుసా ?

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు



కాశీబుగ్గ సెంటర్ : పోస్టల్ బ్యాలెట్ల గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో జారీ చేసిన 12,710 పోస్టల్ బ్యాలెట్లలో ఇప్పటి వరకు 9,544 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈనెల 10వ తేదీలోగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈవీఎం ధర ఇంత..

కాజీపేట : భారతదేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని (ఈవీఎం) డిజైన్ చేసిన వ్యక్తిగా హనీఫా గుర్తింపు పొందారు. అయితే వీటి ధర చాలా మందికి తెలియదు. ఎం–2 రకం ఈవీఎం ధర సుమారు రూ.8,670, ఎం–3 రకం ధర రూ.17వేలు ఉంటుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించడం వల్ల సుమారు 10వేల టన్నుల కాగితం మిగిలిందని అధికారుల అంచనా.

ఇలా.. పోలింగ్ ఏజెంట్ల నియామకం

కాజీపేట: ఎన్నికల్లో అభ్యర్థుల పక్షాన పోలింగ్ స్టేషన్‌లో ఉండే ఏజెంట్ల పాత్ర కీలకం. అభ్యర్థి లేదా ఆయన అనుమతి పొందిన వ్యక్తి ఏజెంట్‌గా నియమితులయ్యే వారికి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుంది. ఏజెంట్లుగా ఉన్నవారు ఉదయం 6 గంటలకే పోలింగ్ బూత్‌కు వచ్చి అభ్యర్థి అందజేసిన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు ప్రొసైడింగ్ ఆఫీసర్‌కు ఇవ్వాలి. ఆయన ఏజెంట్లను నియమిస్తారు. ఇలా పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి పక్షాన ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో ఇద్దరేసి ఏజెంట్లు ఉంటారు. పోలింగ్ స్టేషన్‌లో ఒక అభ్యర్థికి ఒక ఏజెంట్ మాత్రమే ఉండాలి. ఆయన భోజనం లేదా మరే ఇతర అవసరాలపై బయటకు వెళ్లినప్పుడు మాత్రమే రెండో ఏజెంట్‌ను అనుమతిస్తారు. ఓటు వేసేందుకు వచ్చే వారిని అసలైన ఓటరో కాదో అభ్యర్థి పక్షాన ఉన్న ఏజెంట్లు గుర్తించాల్సి ఉంటుంది. ఒకవేళ దొంగ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని గుర్తిస్తే వెంటనే పోలింగ్ అధికారికి ఫిర్యాదు చేసే అధికారం ఏజెంట్‌కు ఉంటుంది. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వెళ్లే అభ్యర్థుల తరపు ఏజెంట్ల నియామకం కూడా ఇలాగే ఉంటుంది. కౌంటింగ్ ఏజెంట్లను ప్రిసైడింగ్ అధికారికి బదులు అసెంబ్లీ ఎన్నికల అధికారి నియమిస్తారు.

సభా వేదికపై ప్రధాని మోదీ, పక్కన బీజేపీ నేతలు సుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌రావు, గరికపాటి మోహన్‌రావు, మార్తినేని ధర్మారావు, రావు పద్మ, గంట రవి తదితరులు



బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజం

ట్రాఫిక్ ఆంక్షలు లేకుండానే సాగిన ప్రధాని పర్యటన
- రహదారిపై యథావిధిగా వాహనాలకు అనుమతి
- పటిష్టమైన పోలీసు భద్రత

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఖిలా వరంగల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రేటర్ వరంగల్ పరిధి తిమ్మాపురం క్రాస్ లక్ష్మీపురం మైదానంలో ఓరుగల్లు జన సభ బుధవారం జరిగింది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు.

మండుటెండలో..

తీవ్ర ఎండను సైతం లెక్క చేయకుండా బీజేపీ ఓరుగల్లు జన సభకు జనాలు పోటెత్తారు. ఉదయం 10 గంటలకే సభా స్థలికి చేరుకున్నారు. సభా ప్రాంగణంలో జనం ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి కాకుండా భారీ కూలర్లు ఏర్పాటు చేశారు. ప్రధాన వేదిక అందరికీ స్పష్టంగా కనిపించేలా.. 10 భారీ డిజిటల్ తెరలు పెట్టారు. రహదారులపై టాటా ఏస్ వాహనంపై డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి మోదీ ప్రసంగాన్ని లైవ్ ఇచ్చే కార్యక్రమం చేపట్టారు. భద్రత దృష్ట్యా నీటి సీసాలను ప్రాంగణంలోకి అనుతించలేదు. సభా వేదిక ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్లు పెట్టి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

భద్రత కట్టుదిట్టం..

ఓరుగల్లు జన సభకు ప్రధాని వచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ నుంచి సభా వేదిక వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా యథావిధిగా వాహనాలను అనుమతించారు. ప్రధాని కాన్వాయ్ రోడ్డు క్రాస్ చేసే ఆ రెండు నిమిషాలపాటు వాహనాలను నిలిపేసి తర్వాత యథావిధిగా అనుమతించారు. హనుమకొండ మీదుగా కరీంనగర్‌కు వెళ్లే భారీ వాహనాలను మాత్రం మామునూరు నుంచి సింగారం క్రాస్ మీదుగా కొండపర్తి, కడిపికొండ బ్రిడ్జి నుంచి కాజీపేటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రహదారి వెంట, సభా ప్రాంగణంలో ఎస్‌పీజీ అధికారులతోపాటు ఏసీపీ తిరుపతి, సుమారు 20 మంది సివిల్ ఇన్‌స్పెక్టర్లు, 50 మంది ఎస్సైలు, 1,000 కానిస్టేబుళ్లు పర్యవేక్షించారు. పీఎం వచ్చి వెళ్లే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

గుర్తుండిపోయేలా..

ఓరుగల్లు సభ వేదికపైకి ప్రధాని నరేంద్ర మోదీ రాగానే.. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంట రవికుమార్, రావు పద్మ, మహబూబాబాద్, వరంగల్ ఎంపీ అభ్యర్థులు సీతారాంనాయక్, అరూరి రమేశ్ మోదీకి వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. చిరకాలం గుర్తుండిపోయేలా జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మోదీకి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు భద్రకాళి అమ్మవారి చిత్రపటం అందజేయగా.. గంట రవికుమార్ బంగారు రంగులోని గద, డైరీ బహూకరించారు.



ప్రధాని మోదీని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ అభ్యర్థులు అరూరి రమేశ్, సీతారాంనాయక్

మోదీతోనే ఎస్సీ వర్గీకరణ..

ఎస్సీ వర్గీకరణ ప్రధాని మోదీతోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మోదీ జన సభలో ఆయన మాట్లాడారు. యావత్ మాదిగ జాతికి నరేంద్రమోదీతోనే న్యాయం జరుగుతుందన్నారు. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థుల గెలుపులో మాదిగ జాతి ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. మణిపూర్‌లో జరిగే అల్లర్లు, హింసలు బీజేపీ ఎలాంటి సంబంధం లేదన్నారు. రెండు తెగల నడమ ఆధిపత్య పోరు జరుగుతోందని, దానిని కాంగ్రెస్ రాజకీయం చేస్తూ బీజేపీపై రుద్దడం సరికాదన్నారు. గతేడాది నవంబర్ 11న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాదిగల భారీ బహిరంగ సభకు మోదీ హాజరై ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు.



ప్రధాని మోదీతో పార్టీ మహిళా నేతలు



సభలో నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు



ప్రధాని సభ వద్ద భద్రతాసిబ్బంది పహారా

ప్రజల ముందుకు పాత వాగ్దానాలే



మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

- మోదీకి తెలంగాణలో తిరిగే హక్కు లేదు
- 13 హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హన్మకొండ: వరంగల్‌లో పర్యటించిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి.. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తామో చెప్పలేదని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ విమర్శించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ప్రజల ముందు పాత వాగ్దానాలు, నినాదాలే వల్లిస్తున్నారని తూర్పారబట్టారు. బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతుంటే, కాంగ్రెస్ బీసీ నినాదం ఎత్తుకుందన్నారు. మండల్ కమిషన్ సిఫార్సుల అమలును ఈ రెండు పార్టీలు వ్యతిరేకించాయని, ఇప్పుడు కాంగ్రెస్ కులగణను ముందుకు తీసుకువచ్చిందని ఎద్దేవా చేశారు. కోచ్ ఫ్యాక్టరీపై ప్రధాని మోదీ స్పందించలేదని విమర్శించారు. పీరియాడికల్ ఓవరాయిలింగ్ యూనిట్‌తో ఉపాధి లభించదన్నారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మాట్లాడిన మోదీకి తెలంగాణలో తిరిగే హక్కు లేదన్నారు. 13 హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కారు విఫలమైందని విమర్శించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వెకిలిగా మాట్లాడారన్నారు. తనను దిష్టిబొమ్మగా అభివర్ణించారని, తాను దుష్టశక్తులను అడ్డుకునే దిష్టిబొమ్మనే అన్నారు. రేవంత్ రెడ్డి తనకంటే జూనియర్ అని, తనకంటే డమ్మీ అన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కడియం కావ్యను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఓడిస్తారన్నారు. కడియం కావ్యను గెలిపిస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తుందని రేవంత్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. తమను కడియం శ్రీహరి ఎక్కడ వేధిస్తారోనని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇందిర వర్గం, వరంగల్ తూర్పులో తమ మంత్రి పదవి ఊడకొడుతారని కొండా సురేఖ వర్గం భయపడుతోందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నాయకులు మర్రి యాదవ రెడ్డి, కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, పులి రజనీకాంత్, నయీముద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మేలు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



తాడిచర్లలో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

మల్హర్ : కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందజేస్తామని రాష్ట్ర ఐటీ శాఖ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని తాడిచర్ల హనుమాన్ సెంటర్‌లో బుధవారం కార్నర్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని, ఆ రెండు పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. త్వరలోనే పెద్దతూండ్ల కిషన్‌రావు అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, కొయ్యూరులో మాజీ మావోయిస్టులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గడ్డం వంశీకృష్ణకు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మా తండాకు రోడ్డు నిర్మించాలి

- సిగ్నల్ తండా వాసుల డిమాండ్..
- పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరిస్తున్నామంటూ ఫ్లెక్సీ ఏర్పాటు



సిగ్నల్‌తండాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

డోర్నకల్ : పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరిస్తున్నామంటూ డోర్నకల్ మున్సిపాలిటీ పరిధి సిగ్నల్‌తండాలో బుధవారం ఫ్లెక్సీ వెలిసింది. మున్సిపాలిటీ నాలుగో వార్డు పరిధిలోని లాలితండా, మాన్యాతండా, చిమ్నాతండాలతో కూడిన సిగ్నల్‌తండాకు మూడు వైపులా రైల్వే ట్రాక్ ఉంటుంది. మూడుతండాల్లో 720 ఓట్లు ఉండగా సుమారు రెండు వేల వరకు జనాభా ఉంటుంది. ఎస్సీ బీసీ కాలనీ నుంచి సిగ్నల్‌తండాకు వెళ్లే మార్గంలో డోర్నకల్, ఖమ్మం రైల్వే లైన్ కింద కొన్ని సంవత్సరాల క్రితం అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఎస్సీబీసీ కాలనీ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అండర్ బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.52 లక్షలు మంజూరయ్యాయి. అయితే నిర్మాణ పనులు ప్రారంభంలోనే నిలిచాయి. దీంతో రెండు నెలల క్రితం గిరిజనులు రోడ్డు నిర్మాణం కోసం ఆందోళనలు నిర్వహించినా పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలకులు రోడ్డు నిర్మాణంపై నిర్లక్షంగా వ్యవహరించిన నేపథ్యంలో తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామంటూ తండాకు వెళ్లే దారిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి

- ఓరుగల్లు వాసికి అవకాశమిచ్చిన కమలం పార్టీ



హన్మకొండ: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అధిష్టానం బుధవారం ప్రకటించింది. ప్రేమేందర్ రెడ్డి హనుమకొండ జిల్లా దామెరలో ఎస్సెస్సీ, పరకాలలో ఇంటర్మీడియట్, వరంగల్ సీకేఎం కళాశాలలో బీఎస్సీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిలాసఫీ, మరఠ్వాడ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచి విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఏబీవీపీలో పలు పదవులు నిర్వహించారు. బీజేవైఎంలోనూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పదవులు నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. పూర్వ వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా, తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 12 ఏళ్లుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ ప్రేమేందర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు.

రెండోసారి ఎమ్మెల్సీ బరిలో..

2004లో శాయంపేట నియోజకవర్గం నుంచి, 2009లో పరకాల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. 2021లో జరిగిన నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించగా.. జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక జరుగుతోంది. ఈ ఉప ఎన్నికలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మరోసారి బరిలోకి దిగుతున్నారు. గురువారం ఆయన నల్లగొండలో నామినేషన్ వేయనున్నారు. బీజేపీ నుంచి పూర్వ వరంగల్ జిల్లా నుంచి పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు, బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సెల్ రాష్ట్ర కో–కన్వీనర్ పులి సరోత్తంరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి ప్రకాశ్‌రెడ్డి టికెట్ ఆశించగా.. పార్టీ అధిష్టానం చివరికి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను, బీఆర్‌ఎస్ ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించగా.. వారు నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థి ప్రకటనతో ప్రధాన పార్టీల ముక్కోణపు పోటీ నెలకొననుంది.

విభజన హామీలు అమలు చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- బలరాంనాయక్‌ను గెలిపిస్తే రాష్ట్రానికి మేలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బయ్యారం: లోక్‌సభ ఎన్నికల్లో బలరాంనాయక్‌ను గెలిపిస్తే రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన హామీలను అమలు చేయించే బాధ్యత తమదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరానాయక్ గెలుపును కాంక్షిస్తూ బుధవారం రాత్రి బయ్యారంలో నిర్వహించిన ఎన్నికల బహిరంగసభలో మంత్రి మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కుపరిశ్రమ, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించి రాష్ట్ర ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే బలరాంనాయక్‌కు కేంద్ర మంత్రిగా అవకాశం లభిస్తుందన్నారు. బలరాంనాయక్ నేతృత్వంలో ఢిల్లీస్థాయిలో జరగాల్సిన అభివృద్ధి పనులు సాధిస్తామన్నారు. బయ్యారం పెద్దచెరువును అభివృద్ధి చేయడంతో పాటు కాల్వలకు సీసీ లైన్ చేయిస్తామన్నారు. తులారాం ప్రాజెక్టు ద్వారా లక్ష్యం మేరకు సాగునీరు అందించే బాధ్యత తమదేనన్నారు. కాగా, బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీ చేపూరి మౌనిక, నాయకుడు కొండ్రెడ్డి సోమిరెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, మంజుల, లీగల్ విభాగం పార్లమెంట్ కోఆర్డినేటర్ కిషన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలు దర్శనం

ఎన్నికల బహిరంగ సభ కోసం నాయకులు చేసిన జనసమీకరణ విఫలమైంది. మంత్రి నాగేశ్వరరావు సభకు వచ్చి ప్రసంగిస్తున్న సమయంలో బహిరంగ సభ ఆవరణలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీంతో మంత్రి కేవలం రెండు నిమిషాల్లోనే తన ప్రసంగం ముగించారు.

మద్యం సేవించి వాహనం నడిపి..

- ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి మూడేళ్ల జైలు





మహబూబాబాద్ రూరల్ : మద్యం సేవించి వాహనం నడపడంతో పాటు అదే వాహనంతో ఓ వ్యక్తిని ఢీకొని అతడి మృతికి కారణమైన వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ బుధవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి రావిశెట్టి యాకేశ్ కథనం ప్రకారం.. 2021 అక్టోబర్ 10వ తేదీన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బక్కరూప్లాతండాకు చెందిన లూనావత్ భద్రు గేదెలు కాసుకుంటూ రోడ్డుపక్కన నిలబడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా విజయవాడ మాచవరం ప్రాంతానికి చెందిన సంపంగి పవన్‌కుమార్ తొర్రూరు వైపు నుంచి ఖమ్మం వైపునకు బొలెరో వాహనంలో వెళ్తూ రోడ్డు పక్కన నిలబడి ఉన్న భద్రును ఢీకొనగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై భిక్షపతి.. పవన్ కుమార్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ఎస్.సాగర్ విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ కీసర పద్మాకర్‌రెడ్డి వాదనలు వినిపించగా ప్రస్తుత సీఐ బానోత్ హతీరాం, ఎస్సై తాహేర్‌బాబా ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి యాకేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్.. పవన్‌కుమార్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

వరంగల్ మార్కెట్‌కు 6 రోజుల సెలవులు

వరంగల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి బుధవారం వరకు వరుసగా 6 రోజులు సెలవులు ఉంటాయని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి గుగులోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న (శుక్రవారం), 11(శనివారం), 12(ఆదివారం)వారాంతపు సెలవు, 13(సోమవారం), 14(మంగళవారం), 15(బుధవారం)వీకెండ్ యార్డు మూసివేత కారణంతో బంద్ ఉంటుందన్నారు. ఈ రోజుల్లో యార్డులో ఎలాంటి విక్రయాలు జరగవని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, దడవాయిలు, కార్మికులు గమనించాలని కోరారు. మార్కెట్ తిరిగి 16వ తేదీన (గురువారం) ప్రారంభమవుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ SSC/ INTER FAIL??? Don't worry Pass from NIOS/OPEN BOARD (One Sitting) JOIN regular Degree Contact: 6301053911, 7989907461 [H-778911]

REAL ESTATE

LAND FOR SALE

■ మడికొండ నుండి ఎల్కుర్తికి BT Road కు నేషనల్ హైవేకు దగ్గర ఉన్న 1.05 ఎకరాల ఓపెన్ ల్యాండ్ కాంపౌండ్ వాల్, 1 రూము ఉన్న ల్యాండ్ స్టాక్ యార్డ్స్, గోదాములకు, సర్వీస్ సెంటర్స్‌కు లీజుకు ఇవ్వబడును. నంప్ర॥ 7093873666. [W-1264896]

SERVICES

■ Are you a Educated Unemployed youth belongs to Scheduled Tribe (ST) and Intrested in Setting up a small scale Industries (MSME) ? If so, Please Contact 8143864175 for advice / Guidance. [W-1264897]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185069]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉసురు తీసిన ఊయల..

- కిందపడి పసికందు మృతి
- సోమిడిలో ఘటన
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు



రోషిత (ఫైల్)

కాజీపేట : హాయిగా నిద్ర పుచ్చాల్సిన ఊయలే ఆ పసికందు పాలిట మృత్యువైంది. అప్పటి వరకు ఆనందంగా ఆడుకున్న ఆ పాపను నిద్ర పుచ్చడానికి తల్లి ఊయలలో పడుకోబెట్టింది. అనంతరం చెల్లిని చూస్తూ ఉండమని ఇంకో కూతురుకు చెప్పి తాను వంటగదిలోకి వచ్చింది. అయితే ఆ పసికందు ఏడుస్తుండగా సోదరి (పసికందు అక్క) ఉయల ఊపుతున్న క్రమంలో కిందపడింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమై చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాదకర ఘటన కాజీపేట మండలం సోమిడిలో జరిగింది. సీఐ వై.సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని చెంపాజిల్లా జంజ్గిర్ మండలం కటొడ్ గ్రామానికి చెందిన లోక్‌నాథ్ ఖర్ష్ తన భార్యతో కలిసి బతుకుదెరువు నిమిత్తం కొంతకాలం క్రితం సోమిడికి వచ్చాడు. ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉండగా పెద్ద కూతురు తమ స్వగ్రామంలో అమ్మమ్మ వద్ద ఉంటోంది. మిగిలిన ఇద్దరు కూతుళ్లతో కలిసి లోక్‌నాథ్ ఖర్ష్ దంపతులు సోమిడిలో ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పనుల నిమిత్తం లోక్‌నాథ్ ఖర్ష్ బయటకు వెళ్లగా తల్లి ఒక ఇనుప కుర్చీకి, దర్వాజాకు చీర కట్టి ఊయల తయారు చేసింది. పసికందు రోషిత ఖర్ష్ (ఆరు నెలల వయసు) ఊయలలో పడుకోబెట్టింది. చెల్లిని చూసుకుమ్మని ఇంకో కూతురుకు చెప్పి వంట చేయడం కోసం ఇంట్లోకి వెళ్లింది. అయితే ఇనుప కుర్చీ కాళ్లు సరిగా లేవు. ఈ క్రమంలో ఊయల ఊపడంతో పాపతో పాటు కిందపడగా రోషిత తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో చిన్నారి మృతదేహంపై మీద పడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనపై లోక్‌నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి వివరించారు.

నిబంధనల మేరకే ఈవీఎంల కమిషనింగ్

- కేంద్ర ఎన్నికల ప్రత్యేకాధికారి నవీన్



అదనపు కలెక్టర్‌తో ఎన్నికల ప్రత్యేకాధికారి నవీన్ విద్ది

వరంగల్: నిబంధనల మేరకే ఈవీఎంల కమిషనింగ్ నిర్వహించినట్లు కేంద్ర ఎన్నికల ప్రత్యేకాధికారి నవీన్ విద్ది పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన నిమిత్తం జిల్లాకు చేరుకున్న ఆయన.. బుధవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఏనుమాముల మార్కెట్ గోదాములలో ఉన్న వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్లలోని ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఏనుమాముల గోదాములలో హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్లలోని ఈవీఎంల కమిషనింగ్, ప్రక్రియ, నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, నాగేశ్వరరావు, విజయ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
ఫ్యామిలీ
వరంగల్
గురువారం ॥ 9-5-2024

అవగాహనే ప్రథమ చికిత్స

ఈ ఫొటోను చూడండి.
ఇందులో ఉన్నది షుగర్ పేషెంట్లు.
ఒకరితో ఒకరు షుగర్ వ్యాధి గురించి మాట్లాడుకుంటూ
అవగాహన కల్పించుకుంటున్నారు.
'చికిత్స కంటే అవగాహన ముఖ్యం'
అంటారు ప్రియా దేశాయ్.
బెంగళూరులో ఆమె పేదవారి కోసం
ఉచిత క్లినిక్‌లు నడుపుతున్నారు.
దయాబెటిస్, బి.పి ఉన్న వారికి
సదస్సులు నిర్వహిస్తూ
ఉచిత మందులు అందేలా చూస్తున్నారు.
ప్రతి ఉదయం ఈ క్లినిక్‌ల ముందు క్యూ కట్టే
పేషెంట్లను చూస్తే ప్రియా సేవ తెలుస్తుంది.




ప్రియా దేశాయ్

సేవ



బెంగళూరులోని శాంతి నగర్‌లో ఉన్న 'అనాహత్' క్లినిక్‌కు వెళితే ఒక బోర్డు మీద ఐదారు రకాల భోజనం ప్లేట్ల ఫొటోలు ఉంటాయి. వాటిలో రొట్టె, కూర, అన్నం, ఇతర కూరలు ఉంటాయి. ప్రతి ప్లేట్ కింద స్టార్లు ఇచ్చి ఉంటారు. ఐదు స్టార్లు ఇచ్చిన భోజనం ప్లేట్‌ను ఆహారంగా తీసుకోవాలని బీపీ, షుగర్ ఉన్న పేషెంట్లకు సులభంగా అర్థమయ్యేలా చెప్తారు. మీ ప్లేట్‌లో ఏముంది అనేదే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని ఈ క్లినిక్‌లో వారానికి రెండుసార్లు జరిగే అవగాహన సదస్సుల్లో తెలియచేస్తారు. ఇలాంటి అవగాహన దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీల తీవ్రతను తగ్గిస్తాయని అంటారు ప్రియా దేశాయ్. ఆమె ఈ క్లినిక్ నిర్వాహకురాలు.

10 వేల మందికి ఒక క్లినిక్

బెంగళూరు జనాభా కోటీ ముప్పై లక్షలకి పైనే. కాని ఇక్కడ మొత్తం 147 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రే ఉన్నాయి. అంటే దాదాపు 80 వేల మందికి ఒక క్లినిక్. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా 30 వేల మందికి ఒక క్లినిక్ ఉండాలి. ఆదర్శవంతమైన పాలనా నిర్వహణ అంటే 10 వేల మందికి ఒక క్లినిక్. ఇలాంటి స్థితిలో పేదలకు ఎలా మంచి వైద్యం అందుతుంది అని అడుగుతారు ప్రియా దేశాయ్. జర్నలిజం అభ్యసించిన ప్రియ తన తల్లి రాణీదేశాయ్ స్ఫూర్తితో వైద్య సేవారంగంలోకి వచ్చారు. అనేక స్వచ్ఛంద సంస్థల్లో పని చేసిన రాణీ దేశాయ్ తన కుమార్తెతో కలిసి 'అనాహత్ క్లినిక్'కు అంకురార్పణ చేశారు. బెంగళూరులో ఉన్న పేదలకు వైద్యం అందించాలనేది అనాహత్ సంకల్పం. నేరుగా క్లినిక్‌కు వచ్చేవారికి వైద్యం అందిస్తూనే హెల్త్ క్యాంప్స్ ద్వారా స్లమ్స్‌లో వైద్య చికిత్స అందించడం అనాహత్ లక్ష్యం. ఇప్పటికి 3 లక్షల మందికి హెల్త్ క్యాంప్స్ ద్వారా వైద్యం అందించారు ప్రియ తన తల్లి రాణీదేశాయ్ చేయూతతో.

బీపీ, షుగర్ బాధితులు

'నగరాల్లో పని చేసే దిగువ ఆదాయ వర్గాల వారు సమయానికి భోజనం చేయరు. ఆహార అలవాట్లు, నిద్రలో క్రమశిక్షణ ఉండదు. శరీరాన్ని పట్టించుకోరు. దానివల్ల బీపీ బారిన పడుతున్నారు. షుగర్ వచ్చిన వారికి షుగర్ వచ్చిన సంగతి కూడా తెలియడం లేదు. మా క్లినిక్‌కు రోజుకు వంద మంది వస్తారు. ఎక్కువ మందికి ఇవే సమస్యలు. మా కౌన్సిలింగ్స్ వల్ల ఎక్కడ ఏ పనిలో ఉన్నా రాత్రి ఎనిమిదికి భోజనం చేయడం నేర్చుకున్నారు చాలామంది' అంటారు ప్రియా దేశాయ్. మిత్రుల దాతల సహాయంతో ఈ క్లినిక్‌ను నడుపుతున్న ప్రియ తగిన సహాయం దొరికితే సేవను విస్తరించవచ్చు అని తపన పడుతుంటారు.

70 రకాల పరీక్షలు

అనాహత్ క్లినిక్‌లో 70 రకాల టెస్ట్‌లు ఉచితంగా చేస్తారు. 100 రకాల మందులు ఉచితంగా ఇస్తారు. వైద్యుల పరీక్ష ఉంటుంది. వీరే కాకుండా ఫిజియోథెరపిస్ట్‌లూ సేవలు అందిస్తారు. 'ఆనంద' అనే కార్యక్రమం ద్వారా సైకియాట్రీ కౌన్సెలింగ్ కూడా ఉంటుంది. 'అన్నింటికంటే ముఖ్యం మేము పేషెంట్స్‌ను ఒక కమ్యూనిటీగా మారుస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని ఒక గ్రూప్‌గా చేసి వారే ఒకరితో మరొకరు మాట్లాడుకుని తామంతా ఈ వ్యాధులను ఎదిరించవచ్చు అనే ధైర్యం పొందేలా చేస్తాం' అన్నారు ప్రియ. చికిత్స అందించడం ఎంత ముఖ్యమో వ్యాధి పట్ల అవగాహన, నివారణ అంతే ముఖ్యమని భావిస్తారు ఈ క్లినిక్‌లో. అందుకే బెంగళూరు పేదలు అనాహత్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రియను, ఆమె తల్లి రాణి దేశాయ్‌ను అభిమానిస్తున్నారు.

'స్లమ్స్‌లో ఉన్నవారు క్లినిక్స్‌కు రారు. స్లమ్స్‌లో హెల్త్ క్యాంప్స్ విస్తృతంగా... క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి చికిత్స మొదలవుతుంది. లేకుంటే అనవసర మరణాలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే అందరూ ఈ విషయమై ముందుకు రావాలి' అని కోరుతున్నారు ప్రియ.

నైపుణ్యమే పెట్టుబడి

సెరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ కష్టమైనదిగా భావిస్తూ మహిళలు ఈ కళను ఎంచుకోవడానికి వెనుకంజ వేస్తుంటారు. అలాంటి ఈ కళను ఎంతో ఇష్టంగా ఎంచుకొని, అందులో రాణిస్తోంది తిరువనంతపుర వాసి రోసా శ్రుతి అబ్రహం. సాధారణంగా పెద్ద పెద్ద కర్మాగారాల నుంచి భారీగా ఉత్పత్తి అయ్యే సిరామిక్ వస్తువుల గురించి మనకు తెలిసిందే. అత్యంత వేగవంతమైన ప్రపంచంలో ప్రాచీన కళారూపాల వెనక దాగి ఉన్న నైపుణ్యాన్ని ఈ తరానికి పరిచయం చేస్తోంది రోసా శ్రుతి.


రోసా శ్రుతి అబ్రహం

''మురికి పట్టిన ఏప్రాన్, మట్టితో నిండిన చేతులు, చిక్కుబడిపోయినట్టు చిందరవందరగా ఉండే జుట్టు.. రోజులో ఎక్కువ పనిగంటలు ఇలాగే కనిపిస్తాను. అయితే, కొంతకాలంగా వరసగా ఆర్డర్లు పొందుతున్నాను. అందుకే రోజులో ఎక్కువ గంటలు స్టూడియోలోనే ఉండిపోతున్నాను.







అందుకు ఎంతో ఆనందంగా ఉన్నాను. నేను ఓ స్టూడియో ఓనర్ అనేకంటే నా స్టూడియోలో నిరంతరం పనిచేసే ఒక శ్రామికురాలిని అని చెప్పుకోవడానికే ఇష్టపడతాను. స్టూడియో అంటే పెద్దదేమీ కాదు ఒక గది. అయితే, బయట పచ్చదనం ఉంటుంది. నాదైన ఈ ప్రపంచంలో అందమైన సిరామిక్స్, గ్లాస్ డిజైన్స్ రూపొందిస్తుంటాను.

మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ఏడేళ్లుగా ఈ తయారీని చేపడుతూనే ఉన్నాను. నిజానికి ఇది ప్రతిరోజూ ఒక కొత్త పాఠమే. నా స్టూడియోలో గడిపే ప్రతి క్షణం ఎంతో విలువైనది.

యజ్ఞంలా .. కళారూపాలు

సిరామిక్స్ అండ్ గ్లాస్ డిజైనింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాక కొన్ని కంపెనీలలో వర్క్ చేశాను. ఏడేళ్లపాటు వివిధ కంపెనీలలో చేసిన ఉద్యోగాలు నాకు అంతగా సంతృప్తినివ్వలేదు. దీంతో ఉద్యోగంలో సంపాదించిన కొద్ది మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఇంటి దగ్గరే 'కొసావో' పేరుతో ఓ స్టూడియోను ఏర్పాటు చేశాను. ఇప్పుడు ఇదే నాకు జీవనాధారం అయ్యింది. కళాకారిణి నుంచి వ్యవస్థాపకురాలిగా ఎదగడం, నేర్చుకోవడం ... నా ప్రయాణం ఇలాగే కొనసాగించాలనుకుంటున్నాను. ఐదేళ్లుగా ఈ పని ఓ యజ్ఞంలా కొనసాగుతూనే ఉంది. కళారూపాల సృష్టిలోనే కాదు ఇతరులకు బోధించడంలోనూ ఆనందాన్ని, ఆదాయాన్నీ పొందుతున్నాను. అందుకే నా స్టూడియోలో ప్రతిరోజూ అన్ని సీజన్లలోనూ క్లాసులు ఉంటూనే ఉంటాయి. 'ఐదేళ్ల కిందటి వరకు మీరెక్కడ ఉంటారో మాకు తెలియదు, ఇప్పుడు ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు' అని క్లాసులకు వచ్చినవారు అంటుంటే చిరునవ్వే నా సమాధానంగా ఉంటుంది.

దేనికదే ప్రత్యేకం..

బయట మనకు ఎన్నో రకాల మిషన్ మేడ్ కళారూపాలు లభించవచ్చు. కానీ, వాటిలో ఒక ఆత్మ అంటూ ఉండదు. ఈ కళను ఏ డిజిటల్ పరికరాలతోనూ భర్తీ చేయలేం. వీటి తయారీలో ఓర్పు, పట్టుదల అవసరం. అందుకు మంచి ప్రతిఫలం కూడా లభిస్తుంది. ఉద్యోగంలో మరొకరి కోసం పనిచేస్తున్నప్పుడు మనకు పరిమితులు ఉంటాయి. సొంతంగా ఏదైనా ప్రారంభించాలంటే అందులో నైపుణ్యం అవసరం. వివిధచోట్ల పనిచేసిన అనుభవం కూడా నాకు చాలా సహాయపడింది. అలాగే, విభిన్న వ్యక్తుల నుంచి వారి ప్రవర్తనల నుండి రకరకాల పద్ధతులు, మార్గాలను అర్థం చేసుకోగలిగాను. ఇవన్నీ నన్ను నేను కొత్తగా మలుచుకోవడానికి సహాయపడ్డాయి.





వస్తువుల తయారీని ఫొటోలుగా తీసి, వాటిని ఆన్‌లైన్ ద్వారా కస్టమర్లకు షేర్ చేస్తుంటాను. ఆ తర్వాత రకరకాల పద్ధతుల్లో అనుకున్న రూపానికి తీసుకువస్తాను. ముఖ్యంగా పాత సినిమాలు, డైలాగ్‌ల నుండి ప్రేరణ పొందిన థీమ్‌లతోనూ వస్తువుల తయారీకి ప్లాన్ చేస్తుంటాను. ఇవి చాలామందిని ఆకట్టుకుంటున్నాయి. సిరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను' అని వివరిస్తుంది రోసా శ్రుతి.



విజయపథం

'మోనా'ర్క్

* ఆత్మవిశ్వాసమే రాజసం
* సాధారణ స్థాయి నుంచి బిలియనీర్ వరకు

వరల్డ్స్ మోస్ట్ ప్రిస్టీజియస్, గ్లామరస్ ఫ్యాషన్ ఈవెంట్ 'మెట్ గాలా-2024'లో బ్రేక్అవుట్ స్టార్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది మోనా పటేల్. 'ఎవరీ మోనా?' అని సెర్చ్ చేసేలా చేసింది. వడోదర నుంచి అమెరికా వరకు ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మోనా ఎదిగిన వైనం స్ఫూర్తిదాయకం. ఫిలాంత్రపిస్ట్‌గా ఎన్నో రకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది...


మోడల్‌గా మోనా పటేల్

గుజరాత్‌లోని వడోదరలో పుట్టి పెరిగిన మోనా పటేల్ చాలామంది అమ్మాయిలలాగే స్కూల్, కాలేజీ రోజుల్లో రకరకాల వివక్షలు, సవాళ్లు ఎదుర్కొంది. 'ఆటలు మగవారి కోసమే','ఆడవారు ఇంట్లోనే క్షేమంగా ఉంటారు' 'లక్ష్యాలు అనేవి మగవారి కోసమే' ఇలాంటి ఎన్నో పురుషాధిక్య భావజాల ధోరణులకు సంబంధించిన మాటలు విన్నది మోనా.

అయితే అలాంటి మాటలకు ఎప్పుడూ విలువ ఇవ్వలేదు.

సవాలుకు సై అనడం తప్ప వెనక్కి తిరిగి చూసింది లేదు.

పన్నెండు సంవత్సరాల వయసు నుంచి బాయ్స్-స్టైల్ హెయిర్ కట్‌తో కనిపించడం ప్రారంభించింది. వస్త్రధారణ కూడా అచ్చం అబ్బాయిలలాగే ఉండేది.

'ఏమిటీ వేషం'లాంటి వెక్కిరింపులకు ముఖం మీదే సమాధానం చెప్పి నోరు మూయించేది.

'హెయిర్ కట్ అనేది రెబిలియన్ యాక్ట్. సెల్ఫ్-ఎంపవర్‌మెంట్‌కు సింబల్' అంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటుంది మోనా.

ఇంటి నుంచి బయటి వెళ్లడమే సాహసంగా భావించే రోజుల నుంచి చదువు కోసం గుజరాత్ యూనివర్శిటీలో అడుగు పెట్టింది. హోమ్ టౌన్ తప్ప మరో టౌన్ తెలియని మోనా పై చదువుల కోసం న్యూజెర్సీలోని రాత్‌గర్స్ యూనివర్శిటీకి వెళ్లింది.

'ఔట్‌సైడ్ ఇండియా లైఫ్ గురించి ఎప్పటి నుంచో ఆసక్తి ఉండేది. చదువుల రూపంలో అది నెరవేరింది. ఒంటరిగా బయలుదేరినప్పటికీ ఆ ఒంటరితనమే ధైర్యాన్ని ఇచ్చింది. కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది' అంటుంది మోనా.

అమెరికాకు వెళ్లిన కొత్తలో అక్కడి వేషధారణ, ఆచార వ్యవహారాలు తనకు కొత్తగా అనిపించేవి.

'ఈ ప్రపంచంలో నేను ఇమడగలనా!' అని కూడా సందేహించేది.

అయితే ఆ ప్రపంచంలోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయధ్వజం ఎగరేసింది మోనా పటేల్.

ఒక్కో మెట్టు ఎక్కుతూ హెల్త్‌కేర్, టెక్, రియల్ ఎస్టేట్... మొదలైన రంగాలలో ఎనిమిది కంపెనీలను నెలకొల్పింది.

వ్యాపార విజయాలే కాదు సామాజిక సేవాకార్యక్రమాలు కూడా మోనాకు ఇష్టం. జెండర్ ఈక్వాలిటీ, అమ్మాయిల చదువు, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకొని 'కొచర్ ఫర్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

'మూడు పెద్ద సూట్‌కేస్‌లతో తొలిసారిగా ఇండియా నుంచి డల్లాస్‌కు బయలుదేరాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మోనా.

ఆ సూటుకేసులలో విలువైన వస్తువులు ఉండచ్చు. అయితే వాటి అన్నిటికంటే అత్యంత విలువైనది... ఆమెలోని ఆత్మవిశ్వాసం. ఆ ఆత్మవిశ్వాసమే మోనా పటేల్‌ను తిరుగులేని ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. ఎంతోమందికి స్ఫూర్తి ఇచ్చేలా చేస్తోంది.

బంగారు రెక్కల సీతాకోకచిలుక

ప్రతిష్ఠాత్మకమైన మెట్‌గాలా 2024 ఎడిషన్‌ను న్యూయార్క్‌లోని 'మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్'లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెన్నిఫర్ లోపెజ్, సారా జెస్సికా, ఆలియా భట్, ఇషా అంబానీ, నటాషా పూనావాలా... మొదలైన ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు. మెట్ గాలా రెడ్ కార్పెట్‌పై కనిపించాలనేది ఎంతోమంది అమ్మాయిల కల. అయితే తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకులు 'వావ్' అనుకునేలా చేసి, మెట్ గాలాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పటేల్. 'ది గార్డెన్ ఆఫ్ టైమ్' థీమ్‌తో రూపొందించిన సీతాకోకచిలక ఆకారంలో ఉన్న గౌనుకు ఎంతోమంది ఫిదా అయ్యారు. 'నా వారసత్వాన్ని సెలబ్రేట్ చేసుకునేలా నా డెబ్యూ లుక్ ఉండాలనుకున్నాను' అంటుంది పటేల్. రెడ్ కార్పెట్‌పై పటేల్ బ్యూటీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మారింది.

బ్యూటిప్స్

కనురెప్పల సోయగం...

- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్‌తో కళ్లను మీనాల్లా మెరిపించవచ్చని తెలిసినాకూడా వాటిని ఎలా అమర్చుకోవాలో అర్థం కాక ఇబ్బంది పడుతుంటే... ఒకసారి ఇలా ట్రై చేయండి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ (సౌందర్య సాధనాల మార్కెట్‌లో దొరుకుతాయి) ఒక సెట్, వాటిని అమర్చడానికి ఐలాష్ గ్లూ తీసుకోవాలి. వీటితోపాటు కత్తెర, ట్వీజర్, ఐ లాష్ కర్లర్, ఐ లైనర్, మస్కారా తీసుకోవాలి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ మరీ పొడవుగా ఉన్నట్లనిపిస్తే తగినంత మేరట్రిమ్ చేయాలి.
- ట్వీజర్ సహాయంతో లాషెస్‌కు గ్లూ పట్టించాలి. ఇప్పుడు వాటిని జాగ్రత్తగా కనురెప్ప మీద అమర్చాలి. గ్లూ ఆరి లాషెస్ సెట్ అయ్యే వరకు ఆగాలి. స్కిన్‌కు అంటుకోకుండా గ్లూవిడిగా ఆరిపోతున్నట్లు అనిపించినా, ఆరాక ఊడి వచ్చేటట్లు అనిపించినా కనురెప్పల మీద ఆర్టిఫీషియల్ లాషెస్ కరెక్ట్‌గా సెట్ అయ్యేటట్లు మెల్లగా నొక్కాలి.



- గ్లూ ఆరిన తర్వాత లాషెస్‌కు డార్క్‌షేడ్ ఐ లైనర్ అప్లయ్ చేయాలి. ఇలా చేయడం వల్ల అసలు కనురెప్పలకు, ఆర్టిఫీషియల్ లాషెస్‌కు మధ్య తేడా కనిపించకుండా అంతా ఒకేలా ఉంటాయి.
- చివరగా ఐలాష్ కర్లర్‌తో వంపు తిప్పాలి. అవసరమనిపిస్తే (మరింతడార్క్‌గా కనిపించాలనుకుంటే) మస్కారా అప్లయ్ చేయాలి.

కోమలమైన పెదవుల కోసం...

- రోజూ ఉదయాన్నే బ్రష్ చేసిన తరువాత.. బ్రష్ మీద కొద్దిగా తేనె వేసి రెండు పెదవులపైన గుండ్రంగా ఐదు నిమిషాలపాటు రుద్దాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదవులపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. మర్ధన వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదవులు మృదువుగా మారతాయి.
- ఉదయం బ్రష్‌తో మర్ధన చేసాక, రాత్రి పడుకునేముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా రాయాలి. ఇందుకోసం.. కొద్దిగా బీట్‌రూట్ రసాన్ని వేడి చేయాలి. వేడిచేసిన రసంలో అర టీస్పూను కార్న్‌ఫ్లోర్ వేసి ఐదు నిమిషాలపాటు బాగా కలిపి దించేయాలి. తరువాత ఈ మిశ్రమంలో అర టీస్పూను గ్లిజరిన్, పావు టీస్పూను కొబ్బరి నూనె కలిపి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేయాలి. ఈ మిశ్రమం గట్టిపడిన తరువాత పెదవులకు రాసి మర్ధన చేసి పడుకోవాలి. ఉదయం నీటితో కడిగేయాలి



- ఈ రెండింటిని ఒకదాని తరువాత ఒకటి క్రమం తప్పకుండా పాటిస్తే పెదవులు గులాబి రేకుల్లా కోమలంగా పింక్ కలర్‌లో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.